కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్‌ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.19, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.23, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటి కాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.105, కందగడ్డ రూ.45, బీట్‌రూట్‌ రూ.31, కీర రూ.23, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పేరుకుపోతున్న చెత్త

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో చెత్తా చెదారం భారీగా పేరుకుపోతోంది. స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించామంటున్న అధికారులకు తమ కాలనీలు, బస్తీల్లోని చెత్త కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలికంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. డివిజన్‌ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌, హరిపురికాలనీ, జనప్రియకాలనీ, కృష్ణానగర్‌, సిరినగర్‌కాలనీ, సౌభాగ్యపురంకాలనీలో చెత్త కుప్పలు భారీగా పేరుకుపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ,బస్తీల వాసులు కోరుతున్నారు.

వసతుల కల్పనకు కృషి



బోర్‌ పనులు ప్రారంభిస్తున్న దయానంద్‌గుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌ ఫణిగిరి కాలనీ కమ్యూనిటీ హాల్‌ వద్ద ఎమ్మెల్సీ నిధులతో ప్రారంభించిన బోర్‌వెల్‌ పనులను గురువారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసమరైన నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు శరత్‌చంద్ర, శశిదర్‌రెడ్డి, సురేందర్‌ రెడ్డి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిపై ఫ్లోర్‌ ఇన్‌చార్జి దాడి

- విరిగిన దవడ ఎముక
- కేసు నమోదు

మలక్‌పేట: విద్యార్థిపై ఫ్లోర్‌ ఇన్‌చార్జి దాడి చేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.విద్యార్థి తల్లిదండ్రులు, పోలీసుల వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ, సాయిబాలజీ నగర్‌ టౌన్‌షిప్‌కు చెందిన అబ్బయ్య కుమారుడు సాయిపునీత్‌ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్‌ కాలేజీలో ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 15న మధ్యాహ్నం కాలేజీలో ఇద్దరు విద్యార్థుల నడుమ జరిగిన వాగ్వావాదంలో ఫ్లోర్‌ ఇన్‌చార్జి మాలి సతీష్‌ జోక్యం చేసుకుని సాయిపునీత్‌పై విచక్షణంగా దాడి చేయడంతో దవడ ఎముక విరిగింది. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సతీష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

సన్మానం



దిల్‌సుఖ్‌నగర్‌: రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా ఏనుగు నరసింహారెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేపురం డివిజన్‌ చిత్రలేవుట్‌ కాలనీ చెందిన ఎస్‌.ఆర్‌.ఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ రామచంద్రరావు గురువారం ఆయనను కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు.

ఆహ్వానం



నాగోలు: బతుకమ్మ సంబరాలకు రావాలని అరుణోదయ కళాకారిణి ప్రజా ఉద్యమాల పోరాట వనిత విమలక్క గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తాను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

బతుకమ్మ సంబరాలకు సన్నద్ధం

- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- 72 ప్రాంతాలో కృత్రిమ కొలనులు
- 750 హైమాస్ట్‌ లైట్లు



చాదర్‌ఘాట్‌: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో బతుకమ్మ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంజినీరింగ్‌, అర్బన్‌ కమ్యూనిటీ అధికారుల ఆధ్వర్యంలో పండుగ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. రెండ్రోజుల్లో పనులు ప్రారంభించి వారం రోజుల్లో పూర్తి చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో 72 ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు వీలుగా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. అదే ప్రాంతాల్లో బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు రూ.4 లక్షల నిధులు కేటాయించారు. ఈ నెల 22 నుంచి ఐదు రోజులు పాటు బతుకమ్మ ఆటలు, పాటల పోటీలను నిర్వహిస్తారు. రోజుకో డివిజన్‌ చొప్పున ఆరు డివిజన్లలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు.

నియోజకవర్గానికి చేరిన బతుకమ్మ చీరలు..

బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాలు కాంతివంతంగా ఉండేందుకు హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు కలుపుకొని మొత్తం 750 విద్యుత్‌ హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మ వేడుకలు సందర్భంగా ఈ సారి స్వయం సహాయక బృందాల మహిళలకు మాత్రమే బతుకమ్మ చీరలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. 20 వేల మంది మహిళలకు చీరలు అందించాలని అధికారులు నిర్ణయించి వార్డు కార్యాలయాల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు



ఏర్పాట్ల పనులు ప్రారంభించిన కార్పొరేటర్‌

సైదాబాద్‌: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంతోషంగా జరుపుకునేలా సరూర్‌నగర్‌ చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఐఎస్‌ సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్‌ చెరువుకు శంకేశ్వర బజార్‌ వైపు బతుకమ్మల నిమజ్జనానికి భక్తులు సులువుగా వెళ్లేందుకు అవసరమైన మెట్ల నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మల వేడుకలకు సరూర్‌నగర్‌ చెరువు వద్దకు మహిళలు పెద్దసంఖ్యలో వస్తారు కాబట్టి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, శ్రీభవానీ శంకర ఆలయం ప్రతినిధి సీహెచ్‌.రామిరెడ్డి, నరసింహారెడ్డి, జనార్దన్‌ రెడ్డి, నందు పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

హయత్‌నగర్‌: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతో శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు హయత్‌నగర్‌–1 డిపో మేనేజర్‌ విజయ్‌ తెలిపారు.ప్రయాణికులు తమ సలహాలు సూచనలు ఇచ్చేందుకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 వరకు 9959226138 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: వ్యాయమంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్‌ పరిధిలోని గాయత్రినగర్‌ బ్యాంక్‌ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌ జిమ్‌ పనులను గురువారం ఆయన డీఈ దామోదర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఓపెన్‌ జిమ్‌ను స్థానికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కార్తిక్‌, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మల్లేష్‌

మలక్‌పేట: నకిలీ వెబ్‌సైట్లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్‌ ఇన్‌స్పెక్టర్‌ మల్లేష్‌ అన్నారు. బజాజ్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ వారి సహకారంతో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌ శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీకు తెలియకుండా వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పరాదన్నారు. సోషల్‌ మీడియాను బాధ్యతయుతంగా వాడుకోవాలని, సైబర్‌ క్రైమ్‌ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రిన్సిపాల్‌ దిలీప్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాసాచారి, బజాజ్‌ ఫైనాన్స్‌ ప్రతినిధి రవికాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేయొద్దు



శానిటేషన్‌ సిబ్బందితో మాట్లాడుతున్న రంగా నర్సింహాగుప్తా

చైతన్యపురి: చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేయరాదని చైతన్యపురి కార్పొరేటర్‌ రంగానర్సింహగుప్తా అన్నారు. చెత్త తరలింపులో వివిధ కాలనీల నుంచి వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా గురువారం సాయినగర్‌ శివాజిచౌక్‌లో డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాస్‌, డీఈఈ చందనతో కలిసి శానిటేషన్‌ సిబ్బందితో కార్పొరేటర్‌ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయానుకూలంగా ఆటో కార్మికులు చెత్తను సేకరించాలని రహదారులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

సామాజిక సేవ బాధ్యతగా భావించాలి

సైదాబాద్‌: సామాజిక సేవ బాధ్యతగా భావించాలని రాష్ట్ర బీజేపీ సీనియర్‌ నాయకుడు సంగోధి పరమేష్‌కుమార్‌ అన్నారు. గురువారం ఐఎస్‌సదన్‌ డివిజన్‌ లక్ష్మీనగర్‌ కాలనీలోని ఆనంద్‌ మార్గ్‌ పాఠశాలలో లక్కీ జెన్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. లక్కీ జెన్‌ ట్రస్ట్‌ సమకూర్చిన ఇంగ్లిష్‌ డిక్షనరీ, నోట్‌బుక్స్‌, బిస్కట్‌ ప్యాకెట్లతో కూడిన బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్కీ జెన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ప్రతినిధులు పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ టీం లీడర్‌ రాజేంద్ర ప్రసాద్‌, రిటైర్డ్‌ డిప్యూటీ కలెక్టర్‌ రాజ్యలక్ష్మి, ఎన్‌.ప్రసాదరావు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి కోర్టులు: మైనర్‌ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షలో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీలు సునితాబర్ల, శోభారాణి వివరాల ప్రకారం .. మీర్‌పేట్‌ ఠాణా పరిధి మురళీకృష్ణనగర్‌లో దివ్య స్టేషనరీ దుకాణాదారుడు గోవింద్‌ ఓం ప్రకాష్‌ శుక్ల దుకాణానికి 2019 జూలై 12న స్టేషనరీ కొనడానికి బాధిత బాలిక తన సోదరుడితో కలిసి వెళ్లింది. దుకాణాదారుడు బాలికను లోపలికి పిలిచి ఆమె శరీరాన్ని అసభ్యకరంగా తాకడంతో భయంతో అక్కడి నుండి పారిపోయి తన తల్లికి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి యంకె. పద్మావతి గురువారం గోవింద్‌ ఓం శుక్లాకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చెరువులో దూకిన మహిళ

కొనసాగుతున్న గాలింపు చర్యలు



భవాని (ఫైల్‌)

చైతన్యపురి: భర్తతో గొడవ పడి ఓ మహిళ చెరువులో దూకిన ఘటన సరూర్‌నగర్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. సైదాబాద్‌ దుర్గాభవానినగర్‌ కాలనీలో ఉంటున్న పొల్ల సాయకుమార్‌కు పదేళ్ల క్రితం భవానితో వివాహం జరిగింది. వీరికి ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భవాని మద్యానికి బానిసవ్వడంతో భార్యాభర్తల నడుమ తరచూ గొడవలు జరిగేవి. మూడ్రోజులు మళ్లీ గొడవ జరగడంతో సాయికుమార్‌ భార్యపై సైదాబాద్‌ మహిళా పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్‌ చేశారు. గురువారం సాయంత్రం సరూర్‌నగర్‌ చెరువు వద్దకు వచ్చిన భవాని భర్తకు ఫోన్‌ చేసి చెరువులో దూకి చనిపోతున్నానని చెప్పింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డి హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గాలింపు చేపట్టారు. బురద ఉండటంతో మునిగి చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యాత్రాదానానికి ముందుకు రావాలి



వెంకటేశం, డిపో మేనేజర్‌

నాగోలు: ఆర్థికంగా వెనుకబడిన పేదలు వృద్ధులు వికలాంగులు, విద్యార్థుల కోసం యాత్రాదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని బండ్లగూడ డిపో మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా ఎండీ సజ్జనార్‌ ఆదేశాలతో టూర్‌ ప్యాకేజీలు యాత్రదానం వంటి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు సేవా భావం కలిగిన నాయకులు సామాజిక సేవలో ఆసక్తి ఉన్నవారు పేదల కోసం తీర్థయాత్రలు, విద్యార్థుల కోసం విజ్ఞాన విహారయాత్రలకు యాత్రాదానం చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి

టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌ చల్లా నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్‌: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పటికప్పుడూ ప్రత్యేక చర్యలు చేపడుతుందని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్‌ చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనుల విషయమై కమిషనర్‌ బి.వెంకట్రామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. నిధుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జల్‌పల్లి మున్సిపల్‌ సీనియర్‌ నాయకులు షేక్‌ జహంగీరుద్దీన్‌, చింతకింది నవీన్‌, ఎంఏ బారీ, నవాజ్‌ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



రామలింగంను సత్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్‌: మన్సూరాబాద్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నర్రి రామలింగంకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వచ్చింది. మన్సూరాబాద్‌ డివిజన్‌ పరిధి మధురానగర్‌కాలనీకి చెందిన రామలింగంను బీఆర్‌ఎస్‌ యువనేత జక్కిడి రఘువీర్‌ రెడ్డి గురువారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, నర్రి వెంకన్న, ఆంజనేయులు, లింగం, రవి పాల్గొన్నారు.

25 నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



మాట్లాడుతున్న కోశిక శ్రీనివాస్‌రావు

మలక్‌పేట: మూసారంబాగ్‌ డివిజన్‌ శాలివాహననగర్‌ యూపీహెచ్‌సీ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శాలివాహననగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యుడు కోశిక శ్రీనివాస్‌రావు కురుమ వివరాలు వెల్లడించారు. బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యాచార్యుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి, గణపతి, శివగంగ, ఆంజనేయ జంటనాగులు, శిఖర ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. భక్తులు సకాలంలో విచ్చేసి అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.ఈ సమావేశంలో చంద్రశేఖర్‌, నర్సింహాచారి, జంగయ్యగౌడ్‌, రాజ్‌కుమార్‌ ఉన్నారు.

కాంగ్రెస్‌ హామీలు అమలు చేయాలి



విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. విద్యార్థి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా చైతన్యపురిలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న అశోక్‌ను పోలీసులు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించడంతో గురువారం ఆయన ఆసుపత్రిలో అశోక్‌ను పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేయడం, జాబ్‌ క్యాలెండర్‌ అమలులోనూ విఫలం అయ్యారని, గ్రూప్‌–1 పోస్టుల నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్‌ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

లింగోజిగూడ: లింగోజిగూడ చౌరస్తాలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ధ్వంసం చేయగా అక్కడే నూతన విగ్రహం ఏర్పాటుకు గురువారం ఎల్‌బీనగర్‌ సుధీర్‌రెడ్డి పలు కుల సంఘలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తిని ఇప్పటికే అరెస్ట్‌ చేశారని కుల సంఘల విజ్ఞప్తి మేరకు త్వరగా విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఇలాంటి ఘటనాలు జరగకుండా మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, తిలక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

నాగోలు: నాగోలు డివిజన్‌ సాయినగర్‌ కాలనీలో గుడిసెవాసుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ పైమీద ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ.. త్వరలోనే సాయినగర్‌ కాలనీలో పర్యటించి వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ పాషా, షాహిదా బేగం, రాము, శ్రీనివాస్‌, రాము, మహేందర్‌, ధనమ్మ, అచ్చాలి నాని, వెంకటేష్‌, రాజు గౌడ్‌, మధు, ప్రమీల పాల్గొన్నారు.

ముగిసిన వేద ఘోష చతుర్వేద పారాయణం



వేత పండితులను సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: నాగోలు డివిజన్‌ శివపురి కాలనీలోని శ్రీశైవ మహాపీఠంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వేద ఘోష చతుర్వేద పారాయణం బుధవారం రాత్రి ముగిసింది. శ్రీ శైవ మహా పీఠాధిపతి డాక్టర్‌ అత్తలూరి మృత్యుంజయ శర్మ, ఉప పీఠాధిపతి మల్లంపల్లి దుర్గా మల్లికార్జున ప్రసాద్‌ ఆశీర్వచనంతో ఆస్థాన పండితులు ఆచార్య డాక్టర్‌ ముదిగొండ అమర్నాథ్‌ శర్మ, పాలక సమితి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ వాస్తు పండితులు ముదిగొండ వీరభద్ర మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ కాశీపతి సోమయాజులు పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆదేశానుసారం టీటీడీకి చెందిన 46 మంది వేద పండితులు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలోని 82 పన్నాలను నిత్యం ఐదు గంటల చొప్పున మూడు రోజుల పాటు పఠించారు. అనంతరం పీఠాధిపతి కాశీపతి సోమయాజులతో పాటు 46 మంది వేద పండితులను నిర్మల గౌతమశ్రమ వ్యవస్థాపకులు శతధిక శివలింగ సంస్థాపకులు నిర్మల రాజావీరేశ్వర శర్మ(కాశేశ్వరం)శాలువాలతో సత్కరించారు.

రేషన్‌ కార్డుల పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరగాలి



ఏఎస్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న కోట్ల శ్రీనివాస్‌

సైదాబాద్‌: రేషన్‌ కార్డుల పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరగాలని హైదరాబాద్‌ జిల్లా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ గురువారం మలక్‌పేట సర్కిల్‌–1 ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల పాటు కొత్త రేషన్‌ కార్డుల ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కొత్త రేషన్‌ కార్డులు అందజేస్తున్నారన్నారు. మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల పరిధిలో చాలా మంది రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా వారికి పంపిణీ జరగక ఇబ్బందులు పడుతున్నారని తాము గుర్తించామని అర్హులను గుర్తించి వెంటనే మంజూరు చేయాలన్నారు.

సమాజ సేవలపై చైతన్యం పెరగాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న మాజీ మేయర్‌ కార్తీకరెడ్డి, కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి

మన్సూరాబాద్‌: యువత ముందుండి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, యువతకు సమాజ సేవలపై చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు, సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధికార ప్రతినిధి సీమ సోమనాథ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, రంగ నర్సింహాగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్‌, క్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు చింతల సురేందర్‌యాదవ్‌, ఎడ్ల అమరేశ్వర్‌, పరాంకుశం రోహిత్‌ పాల్గొన్నారు.

- డ్రగ్స్‌ రహిత దేశం కోసం ఈ నెల 21 ట్యాంక్‌బండ్‌ వద్ద నిర్వహించే 3కే నమో యువ రన్‌ పోస్టర్‌ను ఎంపీ ఈటల రాజేందర్‌ గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు.

కృష్ణతులసినగర్‌ కమ్యూనిటీహాల్లో

మలక్‌పేట: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, బండా కార్తీకారెడ్డి అన్నారు. మూసారంబాగ్‌ బీజేపీ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని గురువారం కృష్ణతులసినగర్‌ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అక్టోబర్‌ 2 వరకు స్వచ్ఛభారత్‌, చిత్రలేఖనాలు, విశిష్ట వ్యక్తులు, కార్మికులకు సన్మానాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతీ ఒక్కరూ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నిరంజన్‌యాదవ్‌, సందడి సురేందర్‌రెడ్డి, సుభాష్‌ చందర్‌, దేవేందర్‌, భరత్‌, నరేష్‌యాదవ్‌, దినేష్‌ పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే భూకబ్జాలు తగ్గుతాయి



రోడ్డును పునరుద్ధరిస్తున్న హైడ్రా అధికారులు

హస్తినాపురం: ప్రజలు సహకరిస్తే భూకబ్జాలు తగ్గుతాయని హైడ్రా ఇన్‌స్పెక్టర్‌ సైదులు అన్నారు. హస్తినాపురం డివిజన్‌ పరిధి గ్రీన్‌ల్యాండ్‌ కాలనీ ప్రధాన రహదారి 50 అడుగుల రోడ్డను గురువారం హైడ్రా అధికారులు పునరుద్ధరించారు. రోడ్డును ఆక్రమించి చేపటిన కబ్జాలను తొలగించారు. సుమారు 20 కాలనీలకు ప్రయోజనమయ్యే రోడ్డును పునరుద్ధరించడంతో ఆయా కాలనీలవాసులు సంతోషం వ్యక్తం చేశారు. భూకబ్జాలపై నేరుగా హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్‌ సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, శివశంకర్‌, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, సతీష్‌, లక్ష్మారెడ్డి, విజయశంకర్‌ పాల్గొన్నారు.